# అన్నా! చెల్లాయ్!

శ్రీమతి చర్ల సత్యవతి

మోహనుడా సంవత్సరమే కళాశాలలో చేరాడు. చేరి రెండునెల్లే అయినా "పువ్వు పుడుతూండగానే పరిమళిస్తుం దన్నట్లు" అతను కాలేజీలో తెలివైన వాడుగా కనబడ్డాడు. అన్నింటిలోనూ ఆరి తేరినట్టే ఆటల్లోకూడ శ్రద్ధ ఉన్నవాడు. "క్రికెట్" ఆట అంటే మహా చెడ్డ ప్రీతి. ప్రతిరోజూ కాలేజీవదలగానే అతను 'క్రికెట్ ఫీల్డ్'లో కనబడతాడు.

మామూలుప్రకారం రాక అతడానాడు క్రికెట్టునుంచి కొంచెం ఆలస్యంగా వచ్చాడు లాడ్జికి బంత్రోతు సాయంతో. గుమ్మం లోంచి బంత్రోతుని పొమ్మని గోడ సాయంగా తన గదివద్దకు కుంటుతూ పోతున్నాడు.

"ఏమండీ! ఆటలో దెబ్బతగిలిందా?" అని ప్రశ్నించిందో యువతి మృదువుగా విచారసూచకంగా.

"మరే! సుశీలా..." అని వెనక్కితిరిగి జవాబిచ్చాడు మోహన్.

"గట్టి దెబ్బ తగిలిందేమండీ?" అని మళ్ళీ ప్రశ్నించింది.

"కాస్త గట్టిగానే అందులోనూ 'క్రికెట్ బాల్' కాదండీ," అని వెనక్కితిరిగి గదిలోకివెళ్లి మంచంమీదవాలాడు. అతని మెదడులో రెక్కలు పడగత్తి సాగినయ్. సుశీలకు తనంటే అంత ప్రేమ యెందుకో? తానక్కడ ప్రవేశించినప్పటినుంచీ సుశీల రోజూ ఓ సారి అతనితో మాట్లాడుతూండేది. అయితే ఈ నాడామె చూపినంత ఆదరం యిదివరలో అతనికి కనపడలేదు. అప్పుడే అతనిలో యింకో ఆలోచన రేకెత్తింది. అసలు సుశీలకి పెళ్లయియుం టుందా. అయితే యింత పెద్దదయినా కాపరానికి వెళ్లకపోవడమేమిటి? అధమం భర్తైనా యీ మధ్య వచ్చినట్లులేదే? చదివి స్తేవున్నమతి పోయినట్టు ఆమె మెళ్లో మంగళ సూత్రాలు కనిపిస్తోంటే పెళ్లవక పోవడమేమిటి! అయింది. పెళ్లయింది. అయితే వీరిద్దరికీ యేమైనా మానసిక కలహాలున్నాయేమో! అదీ అంత సమంజసంగా లేదు. ఛా! ఆ గొడవలన్నీ యెందుకు-ఆమెను నేను ప్రేమిస్తున్నాను - నన్నామె ప్రేమిస్తోంది. అంతే-అంతకన్న ఏం కావాలి? సుశీల నన్నాకర్షించింది. ఆకర్షించకపోతే ఎందుకంత చనువుగా మాట్లాడుతుంది. ఆమె తత్వమే అంతేమో? ఛా! అదంతా సనాతనం. ఏమవనీ-ఆమెననుభవించాలి. చేతికందిన సౌఖ్యరాశిని యేల కాదనాలి!

అంటూ నిద్రలో మునిగాడు.

నాల్గు రోజుల్లో కాలునొప్పితీసింది. గదిలో కూర్చుని వారపత్రిక పేజీలుత్రిప్పు తున్నాడు. దృష్టంతా సుశీలమీదే ఉంది. సుశీల అందరితోనూ క్రొత్త, పాతలేకుండా మాట్లాడుతోవుంటుంది. మగ, ఆడ వివక్షత లేకుండా ప్రతివ్యక్తితోటి ఎంతో చనువుగా వుంటుంది. కొద్దిగా చదువు కుందికూడా. నవలలంటే మహా చెడ్డ యిష్టం. ఎప్పుడూ ఏదో ఒక పుస్తకం చదువుతూనే వుంటుంది. అప్పుడప్పుడా లాడ్జిలోఉంటున్న గుమాస్తాలు రమణరావు, సత్యమూర్తిగార్లు సుశీల, మోహన్ కూర్చుని పేకాడుతూండడం కూడకద్దు. లోకం యేమనుకున్నా సుశీల లక్ష్యంచేసే మనిషి కాదు. మాటల చమత్కారికూడా. ఇవన్నీ సుశీలలో క్రొత్తగా కనబడ్డాయి పట్నవాసానికి క్రొత్తగావచ్చిన మోహన్ కి. అందుచేతే అతనామెను యేదోలా భావించాడు.

మామూలుగా నలుగురూ కూర్చుని అడ్డాట ఆడుతున్నారు. పేకాట ఆడు తున్నంతసేపూ మోహన్ దృష్టి సుశీల మీదే కేంద్రీభూతమైయుంది. ఈ విష యాన్ని సుశీలకూడ గమనించింది. కాని నిశ్చలంగానేయుంది. ఆట ముగించిలేచారు. సుశీల బిందెతీసికొని నీళ్ల కొచ్చింది. మోహను గదిప్రక్కనే వుంది కొళాయి. నీరుతో బిందె నెమ్మదిగా నిండుతోంది. మోహన్ కిటికీలోంచి ఆశాదృక్కులు బరుపుతున్నాడు. ఈ చర్యనంతా 'సుశీల' గమనిస్తూనేవుంది. అతని ఊహా సౌధాలు ఆకాశాన్ని చేరాయి. వాని లక్ష్యం పూర్తయింది. ఆమె వెళ్లిపోయింది. అతనలాగే చూస్తున్నాడు.

సాయంత్రం మామూలుగా హోటలు నుంచి భోంచేసి క్లబ్బుకు పోయి యేమీ తోచక యింటి ముఖం పట్టాడు. మనసులో ఆలోచనలు దొర్లుతున్నాయి. ప్రొద్దుట సుశీలకి వ్రాసిన ప్రేమలేఖకు యీపూట ఫలితం కనబడాలి. ఏంచేస్తుందో? ఏం చేస్తుందేమిటి — అంగీకరిస్తుంది. అంగీక రించకపోతే నావైపెందుకలాచూస్తుంది! ఈ వూహాలతోనే యిల్లు చేరాడు ప్రొద్దుట పత్రిక తిరగేస్తున్నాడు.

ప్రబంధాలలో విరహమంతా అనుభవిస్తు న్నాడు. గుమ్మంలోకొచ్చి తొంగి చూస్తున్నాడు. ఎవరేనా అనుమానిస్తారే మోనని-లోపలకి పోతున్నాడు. ఇంతట్లోకి "సుశీల" బిందెతో కొళాయి దగ్గర కొచ్చింది.

"సుశీలా," అన్నాడాత్రంతో

సమాధానం లేదు.

మళ్లీ పిల్చాడు.

"ఏం" అని గుమ్మములోకొచ్చింది.

అన్నా! చెల్లాయి!



"రా లోపలికి" అన్నాడు.

"ఎందుకు"

"ఎందుకేమిటి" అంటూ చెయ్యిపట్టుకు లాగబోయాడు,

"అన్నయ్యగారూ! నిన్నట్నుంచి మీలోని ఈ ప్రవర్తన చూస్తున్నాను. ఇంత చదువు యిందుకేనా-సంసార స్త్రీల చెరచడానికా! చనువుగా మట్లాడితే యిలా భావిస్తారా?"

"సుశీలా! క్షమించు........"

నోటమాట లేదు. నిశ్చేష్టుడై పోయాడు.

"అన్నయ్యా! నన్ను 'చెల్లి'గా ప్రేమించలేవూ!" అంది.

"సుశీలా —— చెల్లాయ్ —— క్షమించు," అంటూ నిలబడిపోయాడు.




"సౌత్ ఇండియా ఆఫీసు : 5/149, బ్రాడ్వే, మద్రాసు 1."